అర్జీలను సత్వరమే పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించిన తరువాత ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలను జతచేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ను ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలి

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నగర వ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ పనుల యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కమిషనర్ ప్రజారోగ్యశాఖ అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యూజర్ చార్జీల వసూళ్ల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌ఓ వెంకటరమణ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపికలు

వెంకటాచలం : నవంబర్‌లో జరుగనున్న ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు విశ్వవిద్యాలయ స్థాయి ఎంపికలను కాకుటూరులోని వీఎస్‌యూలో సోమవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన వారిలో 65 మంది మహిళలను వివిధ అంశాల ఆధారంగా పరీక్షించి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లగా ఎంపిక చేశారు. ముఖ్యంగా ఎత్తు 150 సెంటీమీటర్లు, పది నిమిషాల్లో 1,500 మీటర్లు పరుగెత్తడం, స్పెషల్ క్యాంపు, సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి, యూత్ అధికారి ఆర్.సైదానాయక్ వ్యవహరించారు.

మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి

తోటపల్లిగూడూరు : ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి చేసిన ఘటన తోటపల్లి పంచాయతీ కామాక్షినగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై జంపానికుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తోటపల్లి పంచాయతీ కామాక్షినగర్‌కు చెందిన ఈదూరు సింహాద్రి ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఆకతాయి పనులు చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఎంబేటి శివయ్య ప్రశ్నించాడు. దీంతో సింహాద్రి తన వెంట తెచ్చుకున్న కత్తితో శివయ్యపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన గ్రామానికి చెందిన అన్నం మురళిపైన కత్తితో దాడి చేసి గాయపరిచి పరారయ్యాడు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఈదూరు సింహాద్రిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.

పరీక్షల ఫీజు గడువు పొడిగించాలి



వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలో డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షల ఫీజు గడువును పొడిగించాలని ఏబీవీపీ నేత రాజశేఖర్ కోరారు. ఈ మేరకు కాకుటూరులోని వీఎస్‌యూలో రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. డిగ్రీ రెండో, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేయకుండానే ఇన్‌స్టెంట్ పరీక్షల ఫీజు కట్టించుకుంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతారని విన్నవించారు. సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేసేంత వరకు ఇన్‌స్టంట్ పరీక్షల ఫీజు గడువు తేదీని పొడిగించాలని కోరారు.

సీజనల్ హాస్టల్ ఏర్పాటుపై విచారణ



ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్రంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటుపై స్టేట్ ఒకేషనల్ కోర్సు డైరెక్టర్ భారతి, రాష్ట్ర పరిశీలకులు అరుణ సోమవారం పర్యటించారు. గత సంవత్సరం గ్రామంలో సీజనల్ హాస్టల్ నిర్వహించారు. ఈ ఏడాది హాస్టల్ నిర్వహణ అవశ్యకతపై అధికారులు గ్రామస్తులు, చిన్నపిల్లలతో మాట్లాడారు. పిల్లల సంఖ్య, స్థానికుల జీవన ప్రమాణాలపై ఆరా తీశారు. ఏ స్థాయిలో పిల్లలు హాజరయ్యారనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, ఎంఈఓ మధుసూదన, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సభ్యుల జీవనోపాధుల పరిశీలన

కొడవలూరు : మండలంలోని గండవరంలో పొదుపు సభ్యురాలు నాగలక్ష్మి రూ.40 వేల సీడ్ క్యాపిటల్‌తో నిర్వహిస్తున్న టీ, కాఫీ పొడుల వ్యాపారాన్ని సెర్ప్ జీవనోపాధుల విభాగం రాష్ట్ర డైరెక్టర్ సరళ సోమవారం పరిశీలించారు. రోజూ ఏ మేర పొడులు తయారు చేస్తున్నారు.. ఖర్చెంత.. ఆదాయమెంత.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారం లాభసాటిగా ఉన్నందున వ్యాపారాన్ని మరింత విస్తృతం చేసేందుకు రూ.లక్ష రుణం అందిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ టీ, కాఫీ పొడుల తయారీ లాభదాయకంగా ఉందని, ఆమెను ఆదర్శంగా తీసుకొని పొదుపు సభ్యులు కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తే రుణ సాయం అందించి ప్రోత్సహిస్తామన్నారు. తొలుత కొడవలూరు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘమిత్ర కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. జిల్లాలోని పలు మండలాల్లో స్త్రీనిధి వసూళ్లు మందకొడిగా ఉన్నాయని, ఆయా మండలాల్లో సమీక్షలు నిర్వహించి వసూలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కామాక్షయ్య, ఏపీఎంలు ఎస్.రుక్మిణి, నాగేంద్ర ప్రసాద్, సీసీలు ఉదయ్‌కుమార్, మమత, సంఘమిత్ర అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


జనార్దన్‌రెడ్డికాలనీలో ప్రాథమిక వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ, ఇస్లాంపేట ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. సోమవారం జనార్దన్‌రెడ్డికాలనీ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు దేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఇంటింటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్వే చేసిన వారందరికీ టోకన్లు అందజేశారు. వచ్చే నెల 3వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని, వచ్చే నెల 10న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని డాక్టర్ తెలిపారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేస్తారని వివరించారు.

యోగా క్రీడాకారిణికి అభినందన



నెల్లూరు (దర్గామిట్ట): థాయిలాండ్ దేశంలో జరిగిన ఏషియన్ పసిఫిక్ ఇంటర్నేషనల్ యోగా పోటీల్లో దేశం తరఫున పాల్గొని బంగారు పతకం సాధించిన నెల్లూరుకు చెందిన కావ్యశ్రీని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్‌ను కావ్యశ్రీ కలిశారు. ఈ సందర్భంగా కావ్యశ్రీకి జేసీ బంగారుపతకం, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఆమె వెంట కోచ్ రవీంద్ర ఉన్నారు.

కుట్రదారులపై చర్యలు తీసుకోండి

నెల్లూరు (దర్గామిట్ట) : సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు చెందిన ఓట్ల తొలగింపునకు కుట్రలు పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీ రోణంకి కూర్మనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 11,291 ఓట్లను తొలగించాలంటూ ఆన్‌లైన్‌లో ఫారం-బీని దరఖాస్తు చేశారని విన్నవించారు. నియోజకవర్గంలోనే ఓటర్లు ఉన్నప్పటికీ లేరని తొలగించేందుకు మాజీ మంత్రి సోమిరెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు కుట్రలు పన్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి కుట్రదారులపై ప్రజాప్రాతినిధ్య చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై దర్యాప్తు జరపాలని ఎస్పీకి కూడా వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనలేక ఓట్ల తొలగింపు చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మెటా విష్ణువర్ధన్‌రెడ్డి, తలమంచి సురేంద్రబాబు, కోనం బ్రహ్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదాంతదేశికర్ తిరునక్షత్ర ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట, గోపురంవీధిలోని వేదాంతదేశికర్ దేవస్థానంలో ఆదివణ్ శఠగోప యతీంద్ర మహాదేశికుల 755వ తిరునక్షత్ర మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సుప్రభాతసేవ, శ్వేత ఛత్ర పల్లకి ఉత్సవం, పినాకిని నదీ తీర్థ, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సంప్రదాయంగా రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి శేష వాహన సేవ, వేదాంతదేశికులకు పల్లకిసేవ, శాత్తుమొరై నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు విజయసారధి బట్టర్, బద్రీనాథ్ బట్టర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కేసీ వరదరాజన్, నేలటూరి బాలాజీ,రమేష్, బండేపల్లి రాజగోపాల్, భాగవతాచార్యులు పర్యవేక్షించారు.

వైభవంగా అభయహస్త గణపతి నిమజ్జనోత్సవం



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మైపాడుగేట్ సెంటర్‌లో ప్రతిష్ఠించిన అభయహస్త గణపతి నిమజ్జనోత్సవాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా కేపీఆర్ యాజమాన్యం సతీష్, నరేష్ రూ.లక్షకు సొంతం చేసుకున్నారు. నవాబుపేట శ్రీమత్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు, మైపాడుగేట్ మిత్రమండలి ఆధ్వర్యంలో దండు మదన్, సునీల్, సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, తేజ తదితరులు నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపట్నుంచి డిగ్రీ మూడో విడత అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడో విడత డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీలో 19 కోర్సులను ప్రారంభించి గత నెల 7వ తేదీ నుంచి తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 94929 34524 నంబరులో సంప్రదించాలని కోరారు.

గణేశ్ లడ్డూ @ రూ.లక్ష



నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ పడారుపల్లి రచ్చబండ వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద లడ్డూ వేలాన్ని సోమవారం నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంలో ఘంటా ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు.

క్షతగాత్రులకు పరామర్శ



నెల్లూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చింతారెడ్డిపాళెంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గొల్లకందుకూరుకు చెందిన ముగ్గురు బాలురను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సోమవారం పరామర్శించారు. బాలుర ఆరోగ్యపరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గొల్లకందుకూరు నాయకులు ఉన్నారు.

తెలుగుభాషకు విస్తృత ప్రచారం కల్పించండి



నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో తెలుగు భాషా విశిష్టతను వివరిస్తూ విస్తృత ప్రచారం కల్పించాలని ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్ అధ్యక్షుడు ఆళహరి వెంకటేష్ కోరారు. ఈ మేరకు నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీ విజయబాబును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగుభాష గొప్పదనాన్ని వివరిస్తూ ప్రచురించిన పత్రాలను విజయబాబుకు అందజేశారు. విద్యార్థి, యువతతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాములను చేయడం ద్వారా మాతృభాష మరింత అభివృద్ధి సాధించగలదని విన్నవించారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు

మనుబోలు : స్థానిక విష్ణాలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా రాధాకృష్ణయ్య–రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను పెనుగొండ సుధాకర్, ముంగర ధనుంజయరెడ్డి, కసుమూరు రామసుబ్బారెడ్డి, చల్లా శ్రీధర్ పర్యవేక్షించారు.

సమగ్ర దర్యాప్తుతో నిందితులకు శిక్షలు

• ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సమగ్ర దర్యాప్తుతో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు సిబ్బందితో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చోటు చేసుకున్న పెండింగ్ గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఆస్తి, తదితర నేరాలపై సమీక్షించారు. కేసుల పెండెన్సీ తగ్గించేందుకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దని, నో యాక్సిడెంట్ వీక్ పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, బ్లాక్‌స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసులను మొదటి ప్రాధాన్యతగా స్వీకరించి, సాంకేతికత ఆధారంగా ఛేదించి వారి కుటుంబసభ్యులకు అప్పగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను త్వరిగతిన అమలు చేయాలన్నారు. బ్యాంకు అధికారుల సమన్వయంతో సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో పాతనేరస్తులై ఉండి ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హత్యకేసులు, రాబరీ, పోక్సో, రేప్, ప్రాఫర్టీ, 174 సీఆర్పీసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డీపీఓకు సంబంధించిన పెండింగ్ రిఫ్లెఫైల్స్, తదితరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, లీగల్ అడ్వైజర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఔషధ నిపుణుల పాత్ర కీలకం

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


ఫార్మాసిస్ట్ సూపర్‌వైజర్ రాధాను శాలువాతో సత్కరించి కేక్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు): ఆరోగ్య రంగంలో ఔషధ నిపుణుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం సందర్భంగా సంతపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో సోమవారం సంబరాలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా ఫార్మాసిస్టులు కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర అధికంగా ఉంటుందన్నారు. ఫార్మాసిస్టులు ఔషధాలను సురక్షితంగా ఎలా వినియోగించాలో ప్రజలకు తెలియజేసి వారి ఆరోగ్యాన్ని సంరక్షించడంలో తోడ్పడుతున్నారని కొనియాడారు. ఆరోగ్య రంగం సవ్యంగా నడవాలంటే ఫార్మాసిస్టులు ఎంతో అవసరమన్నారు. అందుకే ప్రపంచ ఔషధ దినోత్సవం రోజున ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఔషధ నిపుణుల సేవలను గుర్తిస్తూ సత్కరించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఫార్మాసిస్ట్ సూపర్‌వైజర్ రాధాను శాలువాతో డీఎంహెచ్‌ఓ సత్కరించారు.

టీటీడీ ఉద్యోగులకు వస్త్రాల బహూకరణ


టీటీడీ ఉద్యోగులకు వస్త్రాలు బహూకరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (దర్గామిట్ట) : శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు, ఉద్యోగులకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం వస్త్రాలు బహూకరించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో తిరుమలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదాపు రెండు వేల మందికి వస్త్రాలు అందజేశారు. నిత్యం తిరుమల పవిత్రతను కాపాడుతూ శ్రీవారి భక్తులకు సేవలు అందించడంపై వారిని అభినందించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

గానగంధర్వుడు బాలుకు ఘన నివాళి


ఎస్పీ బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్,కళాకారులు

నెల్లూరు(బృందావనం): చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మూడో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులోని బాలు విగ్రహానికి వాకర్స్, కళాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిప్యూటీ గవర్నర్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ నెల్లూరీయుడైన బాలసుబ్రహ్మణ్యం తన అద్వితీయ ప్రతిభాపాటవాలతో భారతీయ చలనచిత్రరంగంలో రాణించి తనకంటూ ఓ విశిష్ట స్థానాన్ని పొందారన్నారు. నెల్లూరుకు విశ్వఖ్యాతిని తెచ్చిపెట్టారన్నారు. గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్ప మాట్లాడుతూ కళాకారులకు బాలసుబ్రహ్మణ్యం స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఆయన సామాజిక సేవలు ఎనలేనివిగా పేర్కొన్నారు. అసోసియేషన్‌ల సభ్యులు పాముల రమణయ్య, శివప్రసాద్‌నాయుడు,పెంచలనాయుడు, ఎల్ బాబు, టీ సురేష్‌కుమార్, పీ వాసుబాబు,టీ కేశవనాయుడు, ఎస్వీ సత్యం, బాషా, న్యాయవాది వెంకటేశ్వర్లు, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న వాకర్స్

నెల్లూరు రూరల్: పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బాలబాలికలకు వాకర్స్ గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి, వాకర్స్ డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి రూ.12 వేలు నగదును కేటగిరీల వారీగా అందజేశారు. హెచ్‌ఎంలు జ్యోతిర్మయి, కృష్ణారెడ్డి, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెంచయ్య, ఖాజామస్తాన్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, చెంచురామమూర్తి, వెంకటసుబ్బయ్య, మేరీ బ్లెసింగ్‌టన్, పద్మమ్మ, లక్ష్మి, సావిత్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కానిస్టేబుల్ మృతి


రవి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు...కొడవలూరు మండలం చంద్రశేఖరపురానికి చెందిన ఎం రవి(36) పోలీసుశాఖలో 2009లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. ప్రస్తుతం సంతపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా రవి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అనారోగ్యానికి తాళలేక ఈ నెల 23న ఆయన ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కానిస్టేబుల్ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన గుంటూరు జిల్లా నిడిబ్రోలుకు తరలించారు. రవి మృతికి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర నాయకుడు వై శ్రీహరి సంతాపం తెలిపారు.